

జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ
డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
వీక్షించండి
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

ఎడిటర్: చౌదరి, 9963063761



గురువారం | 15-10-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 808 పేజీలు: 4 వెల : రూ.7


* చుట్టుపక్కల పంటపొలాలు, ఇళ్లపైకి రాళ్లు
* పేలుళ్ల శబ్దాలకు బీటలు వారుతున్న ఇళ్లు, పాఠశాలలు
* నిర్వాహకులు కనీస నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు
* భయాందోళనలో పెద్దగుజ్జువాడ గ్రామస్థులు
* భద్రతా చర్యలు చేపట్టాలని పలుమార్లు అధికారులకు వినతి
* మామూళ్ల దందాలో పట్టించుకోని సంబంధిత అధికారులు



# పెద్ద గుజ్జువాడ గ్రానైట్ క్వారీలో.. భారీగా పేలుళ్లు

శ్రీకాకుళం, అక్టోబర్ 14 (వార్త): సారవకోట మండలం గోవర్ధనపురం పంచాయతీ పరిధిలోని పెద్దగుజ్జువాడ గ్రామానికి ఆనుకుని గ్రానైట్ క్వారీ కార్యకలాపాలతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. క్వారీలో నిర్వహిస్తున్న పేలుళ్ల కారణంగా రాళ్లు ఎగిరిపడి గ్రామంపై పడుతున్నాయి. పేలుళ్ల శబ్దాలకు  ఇళ్లు, పాఠశాల గోడలకు బీటలు వారుతున్నాయి. చెవులకు చిల్లు పడుతున్నాయి. ఎటు నుంచి ఏ రాయి పడుతుందోనని ప్రజలు క్షణమొక యుగంలో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ముఖ్యంగా పాఠశాల సమీపంలో క్వారీ కార్యకలాపాలు కొనసాగుతుండటంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చుట్టుపక్కల పంటపొలాల్లో రాళ్లు ఎగిరిపడుతున్నాయి. దీనివల్ల పంటలకు నష్టం వాటిల్లుతోంది. క్వారీ నిర్వాహకులు కనీస నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. అనుమతులకు మించి మందుగుండు వినియోగిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న భారీ వాహనాలతో గ్రామ రహదారులు దెబ్బతింటున్నాయి. వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము రేగడంతో ప్రజలు శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు. క్వారీ కార్యకలాపాలను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నాయా లేదా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని గ్రామస్థులు కోరారు. పేలుళ్ల సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలు, విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను అధికారులు తీవ్రంగా పరిగణించి తక్షణమే పరిశీలన చేపట్టాలని  గ్రామస్థులు కోరుతున్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు మేల్కోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**(అసలు ఈ క్వారీ కలాపాలు చేపట్టేందుకు ఏ మేరకు అనుమతులు ఉన్నాయి.. రాళ్లను పేల్చేందుకు మందుగుండు ఎక్కడి నుంచి తెస్తున్నారు.. ఎక్కడ భద్రపరుస్తున్నారు, కనీస నిబంధనలు పాటిస్తున్నారా, ఎవరెవరికి ఎంతెంత ఇస్తున్నారు, దీనివెనుక సూత్రధారులు, పాత్రధారులు ఎవరు.. తదితర సమగ్ర వివరాలతో ప్రత్యేక కథనం త్వరలో 'జాతీయ వార్త' వెలుగులోకి..)**



# స్థానిక సంస్థల ఎన్నికలకు మోగిన.. నగారా

* ఎన్నికల షెడ్యూల్ విడుదల * నేటి నుంచి కోడ్ అమలు * మూడు దశల్లో ఎన్నికల నిర్వహణ * 13 నగరపాలక సంస్థలు, 77 పురపాలక సంఘాలు, 10 నగర పంచాయతీలకు ఎన్నికలు * వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా * ఎంపీపీ అధ్యక్ష పదవుల రిజర్వేషన్లు ఖరారు: కలెక్టర్

శ్రీకాకుళం, అక్టోబర్14 (ప్రశ్నించే వార్త):   ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక  సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్రవ్యాప్తంగా మూడు దశల్లో స్థానిక ఎన్నికల ప్రక్రియను నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. ఇందులో భాగంగా 13 నగర పాలక సంస్థలు, 77 పురపాలక సంఘాలు, 10 నగర పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 28న పట్టణ స్థానిక సంస్థలకు పోలింగ్ నిర్వహించి, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు. మరోవైపు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతోపాటు గ్రామ పంచాయతీ ఎన్నికల తేదీలను కూడా ప్రకటించింది. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా అక్టోబర్ 16 నుంచి 18వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 19న నామినేషన్ల పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణ, అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించి, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు. అలాగే రాష్ట్రంలో 13 నగరపాలక సంస్థలు, 77 పురపాలక సంఘాలు, 10 నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. నవంబర్ 3న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. నవంబర్ 5న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించారు. నవంబర్ 26న తొలి దశ, నవంబర్ 29న రెండో దశ, డిసెంబర్ 2న మూడో దశ ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు  రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఎంపీపీ అధ్యక్ష పదవుల రిజర్వేషన్లు ఖరారు

జిల్లాలో సాధారణ పంచాయతీ రాజ్ ఎన్నికల-2026 నిర్వహణకు సంబంధించి ఆయా మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) అధ్యక్ష పదవుల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ప్రత్యేక గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం-1994 సెక్షన్ 180 కల్పించిన అధికారాలతో పాటు, ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.154 కు అనుగుణంగా ఈ రిజర్వేషన్లను కేటాయించినట్లు నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. మొత్తం 30 మండలాలకు గాను షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), వెనుకబడిన తరగట్లు (బీసీ), మహిళలు, అన్-రిజర్వ్‌డ్ (యూఆర్) కేటగిరీల వారీగా అధ్యక్ష స్థానాలను కేటాయిస్తూ అన్నెక్సర్-1 జాబితాను అధికారికంగా ప్రకటించారు.

మండలాలవారీగా రిజర్వేషన్ల వివరాలు..

మెలియాపుట్టి మండలం ఒక్కటి మాత్రమే ఎస్టీ కేటగిరికి రిజర్వ్ చేశారు.  జి.సిగడాం (జనరల్), కొత్తూరు (మహిళ), పాతపట్నం (మహిళ) స్థానాలు ఎస్సీలకు కేటాయించారు.  పోలాకి, శ్రీకాకుళం, సంతబొమ్మాళి, పొందూరు, కోటబొమ్మాళి స్థానాలు జనరల్‌కు కేటాయించగా, వజ్రపుకొత్తూరు, గార, నరసన్నపేట, సోంపేట, ఎచ్చెర్ల, కవిటి స్థానాలను బీసీ మహిళలకు కేటాయించారు. ఆమదాలవలస, బూర్జ, హిరమండలం, ఇచ్ఛాపురం, ఎల్.ఎన్.పేట, లావేరు, రణస్థలం, సరుబుజ్జిలి స్థానాలు జనరల్ (యూఆర్) కేటగిరీలో ఉండగా; జలుమూరు, కంచిలి, మందస, నందిగాం, పలాస, సారవకోట, టెక్కలి స్థానాలను అన్ రిజర్వ్ మహిళలకు కేటాయించారు ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత పారదర్శకతతో ఎంపీపీ అధ్యక్ష పదవుల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసి జిల్లా గెజిట్‌లో ప్రచురించినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు.

జెడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఖరారు..

జిల్లాలో పంచాయతీ రాజ్ ఎన్నికల-2026 నిర్వహణకు సంబంధించి జిల్లాలోని జెడ్పీటీసీ  స్థానాల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. మొత్తం 30 జెడ్పీటీసీ స్థానాలకు గాను షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), వెనుకబడిన తరగతులు (బీసీ), మహిళలు మరియు అన్-రిజర్వ్‌డ్ (యూఆర్) కేటగిరీల వారీగా స్థానాలను కేటాయించారు. మండలాలవారీగా జెడ్పీటీసీ రిజర్వేషన్ల వివరాలను పరిశీలిస్తే పాతపట్నం మండలం ఒక్కటి ఎస్టీ కేటగిరికి రిజర్వ్ చేయబడింది. బూర్జ, లావేరు (ఎస్సీ-మహిళ), టెక్కలి (ఎస్సీ-జనరల్), ఆమదాలవలస, ఇచ్ఛాపురం, ఎల్.ఎన్.పేట, మందస, రణస్థలం, సరుబుజ్జిలి స్థానాలు బీసీ మహిళలకు కేటాయించారు. జలుమూరు, కంచిలి, నందిగాం, పలాస, సారవకోట స్థానాలు బీసీ జనరల్ కేటగిరీలో ఉన్నాయి. హిరమండలం, కొత్తూరు, మెలియాపుట్టి, పోలాకి, పొందూరు, సంతబొమ్మాళి, శ్రీకాకుళం స్థానాలు యూఆర్ (మహిళ) కేటగిరీకి ఉన్నాయి.   ఎచ్చెర్ల, జి.సిగడాం, గార, కవిటి, కోటబొమ్మాళి, నరసన్నపేట, సోంపేట, వజ్రపుకొత్తూరు స్థానాలు యూఆర్ (జనరల్) కేటగిరీలో కొనసాగుతాయి. ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత పారదర్శకతతో జెడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసి జిల్లా గెజిట్‌లో ప్రచురించినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు.



రోడ్డు ప్రమాదం సృష్టించి..

# నగదు దోపిడి!

* రాబరి, కిడ్నాప్‌కు పాల్పడిన ఇద్దరు నిందితుల అరెస్టు
* రూ.88,550 ఆన్‌లైన్ బదిలీ
* నిందితుల నుంచి  ఆటో, బైకు, మూడు ఫోన్లు, రూ.18,550 నగదు స్వాధీనం

పలాస, అక్టోబర్14 (వార్త): రహదారిపై ప్రమాదం సృష్టించి, వాహనదారుడిపై దాడి చేసి, అతడిని బలవంతంగా తీసుకెళ్లి బెదిరింపులతో నగదు బదిలీ చేయించుకున్న ఇద్దరు నిందితులను కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేశారని కాశీబుగ్గ డీఎస్పీ జీవీ  రమణ వెల్లడించారు. ఈ ఘటనలో నిందితుల నుంచి ఒక ఆటో, ఒక బైకు, మూడు స్మార్ట్‌ఫోన్లు, రూ.18,550 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను కాశీబుగ్గ డీఎస్పీ జి.వి. రమణ బుధవారం మీడియాకు వివరించారు. పలాస మండలం రామకృష్ణాపురం సమీపంలోని జాతీయ రహదారి-16పై ఈ నెల 11వ తేదీ తెల్లవారుజామున 3.15 గంటల సమయంలో ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బాధితుడిని లక్ష్యంగా చేసుకున్న నిందితుల్లో ఒకరు తన ఆటోతో అతడి వాహనాన్ని ఢీకొట్టారు. అనంతరం బాధితుడిపై దాడి చేసి, అతడి ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను లాక్కొని, బలవంతంగా ఆటోలో తమతో తీసుకువెళ్లారు. బాధితుడిని నిందితుడు కిర్రి సాయికృష్ణ ఇంటికి తీసుకెళ్లి బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితుడి ఫోన్‌పే ఖాతా నుంచి కిర్రి సాయికృష్ణ ఖాతాకు రూ.80,000, గొర్లె రవితేజ ఖాతాకు రూ.8,550 చొప్పున మొత్తం రూ.88,550 బదిలీ చేయించుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొన్న ఏ-1 కిర్రి సాయికృష్ణ (23) పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలోని పురుషోత్తపురానికి చెందినవాడు. ఏ-2 గొర్లె రవితేజ (20) పలాస మండలం కొత్తపూరుకు చెందినవాడు. వీరిద్దరూ గతంలో పలాస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్నారు. తమ వ్యసనాల కోసం డబ్బు అవసరం కావడంతో తక్కువ సమయంలో అక్రమంగా ఎక్కువ మొత్తాన్ని సంపాదించాలనే ఉద్దేశంతో ఈ నేరానికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు. ఈ నెల 13వ తేదీన కిర్రి సాయికృష్ణ ఇంటి వద్ద ఏ-1 కిర్రి సాయికృష్ణ, ఏ-2 గొర్లె రవితేజలను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి ఒక ఆటో, ఒక బైకు, మూడు స్మార్ట్‌ఫోన్లు, రూ.18,550 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. రహదారులపై అనుమానాస్పద ఘటనలు ఎదురైనా, ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ సూచించారు. సమావేశంలో కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు, కాశీబుగ్గ ఎస్సై దుర్గాప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# అభ్యర్థుల ఎంపికపై టీడీపీ కసరత్తు

### - పలాసలోని పరిస్థితులు,

### గెలుపు అవకాశాలపై నాయకులతో చర్చలు

**పలాస, అక్టోబరు 14 (వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలను మెరుగుపరచడం, సమర్థులైన అభ్యర్థులను ఎంపిక చేయడం, నాయకుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ ముఖ్య నాయకులు చర్చలు నిర్వహించారు.

పలాస ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జిల్లా తెలుగుదేశం పార్టీ పరిశీలకుడు మహమ్మద్ నజీర్, పలాస నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వెంకన్న చౌదరి ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. పురపాలక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికకు సంబంధించి స్థానిక రాజకీయ పరిస్థితులు, అభ్యర్థుల బలాబలాలు, క్షేత్రస్థాయిలో పార్టీకి ఉన్న మద్దతు తదితర అంశాలపై నాయకులు చర్చలు జరిపారు.దపురపాలక ఎన్నికలు స్థానిక సమస్యలు, ప్రజలతో అభ్యర్థులకు ఉన్న సంబంధాలు, వార్డులవారీగా పార్టీ బలంపై ఆధారపడి ఉంటాయని భావిస్తున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికకు ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ క్రమంలో ప్రతి వార్డులో పార్టీ విజయావకాశాలను అంచనా వేస్తూ, అధిష్ఠానం మార్గదర్శకాలకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంపై చర్చించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తూ, క్షేత్రస్థాయిలో ప్రజల మద్దతును కూడగట్టాలని నాయకులు అభిప్రాయపడ్డారు. అభ్యర్థుల ఎంపికలో స్థానిక పరిస్థితులకు ప్రాధాన్యమిస్తూ, పార్టీ విజయమే లక్ష్యంగా సమష్టిగా ముందుకు సాగాలని నిర్ణయించినట్లు సమాచారం.

మొత్తంగా, పలాస-కాశీబుగ్గ పురపాలక ఎన్నికలకు ముందుగానే అభ్యర్థుల ఎంపికపై తెలుగుదేశం పార్టీ దృష్టి సారించడం స్థానిక రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. వార్డులవారీగా అభ్యర్థుల ఎంపిక, నాయకుల మధ్య సమన్వయం, ఎన్నికల వ్యూహాల అమలు తదుపరి రాజకీయ పరిణామాలను ప్రభావితం చేయనున్నాయి.



## కిడ్నీవ్యాధితో మరణించిన .. వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సాయం



**మందస, అక్టోబరు 14(వార్త):** మందస మండలంలోని సువర్ణపురం పంచాయతీ నాతుపురం గ్రామానికి చెందిన కళ్యాణ్ కిడ్నీవ్యాధితో బాధ పడుతూ మరణించారు. సిక్కోలు ఉద్దానం సేవాసమితి సభ్యురాలిగా కళ్యాణ్ భార్య సావిత్రి ఉన్నారు. సిక్కోలు ఉద్దానం సేవాసమితి ఆధ్వర్యంలో 10,000 రూపాయలు ఆర్థిక సహాయం సేవా సమితి సభ్యురాలు సావిత్రికి చిన్న పాపతో పాటు ఆ కుటుంబం పేదరికంతో కూడుకున్న కుటుంబం. ఎంతోమందికి సహాయం అందిస్తున్న సిక్కోలు ఉద్దానం సేవా సమితి మన సభ్యులకే ఆపద వస్తే ముందు ఉంటుందని తెలిపారు. చిన్నారి పాపతో ఇల్లు జరగడం కష్టంగా మారడంతో మా వంతు సహాయంగా 10,000 రూపాయలు అందించడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు వినోద్, విషు, ప్రభాకర్ పట్నాయిక్ పాల్గొన్నారు.

## కిల్లమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే శిరీష



**మందస, అక్టోబరు 14(వార్త):** మందసలోని శ్రీరాజావారి కోటలో పూజలందుకుంటున్న కిల్లమ్మతల్లిని పలాస నియోజకవర్గ శాసనసభ్యురాలు గౌతు శిరీష భక్తి,శ్రద్ధలతో దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్రం నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, అందరిపై అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రార్థించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా మందస మండల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు మండల ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే గౌతు శిరీష స్థానిక నాయకులు, పూజారులు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం నాయకులు, కార్యకర్తలు ప్రజలను కలిసి స్థానిక సమస్యలు, అభివృద్ధి విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాలుపంచుకోవడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది

## నేడు హరిపురంలో టీడీపీ ప్రత్యేక సమావేశం



**మందస, అక్టోబరు 14(వార్త):** మందస మండలంలోని హరిపురంలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ నెల 15న తెలుగుదేశం పార్టీ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన చెప్పారు. గురువారం ఉదయం 10 గంటలకు హరిపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించనున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మండలస్థాయి ప్రతీ రెండవ బుధవారం పెట్టాల్సిన మండలస్థాయి సమావేశం నేడు నిర్వహించబడుతుందన్నారు. కార్యక్రమానికి మండల సీనియర్ నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర కమిటీల్లో ఉన్న నాయకులు, పాత్రికేయులు తప్పనిసరిగా హాజరు కావాలని దుర్యోధన విజ్ఞప్తి చేశారు.

## మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం సులభం

**పలాస, అక్టోబరు 14 (వార్త):** న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయని, ఇరుపక్షాల మధ్య పరస్పర చర్చలతో వివాదాలకు సామరస్యపూర్వక పరిష్కారం లభిస్తుందని శిక్షణ పొందిన న్యాయవాది, మధ్యవర్తి జి.ఎం.ఎస్. అనిల్ రాజు తెలిపారు. బుధవారం కాశీబుగ్గ పెంటివీధిలో జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు, పలాస మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, సివిల్ జడ్జి సూచనలతో మధ్యవర్తిత్వ ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ రాజు మాట్లాడుతూ న్యాయస్థానాల్లో వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో పరిష్కారానికి అవకాశం ఉన్న వివాదాలను మధ్యవర్తిత్వ ప్రక్రియ ద్వారా చర్చించుకోవచ్చని వివరించారు. వివాదంలో ఉన్న ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యను పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం దోహదపడుతుందన్నారు. దీనివల్ల సుదీర్ఘ న్యాయ ప్రక్రియకు పట్టే సమయం తగ్గడంతో పాటు న్యాయపరమైన ఖర్చుల భారం కూడా తగ్గుతుందని తెలిపారు. వివాదాలను పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవడం వల్ల ఇరుపక్షాల మధ్య సత్సంబంధాలు కొనసాగేందుకు అవకాశం ఉంటుందని, అనవసరమైన విభేదాలను నివారించవచ్చని తెలిపారు. మధ్యవర్తిత్వ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మధ్యవర్తిత్వ ప్రయోజనాలను వివరించే కరపత్రాలను స్థానిక ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పెంట రత్నాకర్‌తో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.






## నాణ్యత, భద్రత ప్రమాణాల గుర్తులపై వినియోగదారులకు అవగాహన అవసరం

### -వస్తువుల కొనుగోలులో ప్రమాణాల గుర్తులను పరిశీలించాలి

### - జిల్లా వినియోగదారుల క్లబ్బుల మాస్టర్ శిక్షకుడు ఎల్. వెంకటాచలం

**పలాస, అక్టోబరు 14 (వార్త):** వినియోగదారులు తాము కొనుగోలు చేసే వస్తువుల నాణ్యత, భద్రత, విశ్వసనీయతను నిర్ధారించుకోవడానికి వాటిపై ఉన్న ప్రమాణాల గుర్తులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వినియోగదారుల క్లబ్బుల మాస్టర్ శిక్షకుడు, భారత ప్రమాణాల సంస్థ క్లబ్బుల మార్గదర్శకుడు ఎల్. వెంకటాచలం సూచించారు. ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన తెలియజేశారు. ప్రజల దైనందిన జీవితంలో వినియోగించే వస్తువుల నాణ్యతను గుర్తించడం, సురక్షితమైన ఉత్పత్తులను ఎంపిక చేసుకోవడం ప్రతి వినియోగదారుడికి అవసరమని తెలిపారు. వస్తువుల కొనుగోలు సమయంలో వాటిపై ఉన్న భారతీయ ప్రమాణాల గుర్తు, బంగారు ఆభరణాలపై హాల్‌మార్క్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు వర్తించే నాణ్యత, భద్రత ప్రమాణాల గుర్తులను పరిశీలించాలని సూచించారు. కేవలం ధర, ఆకర్షణీయమైన రూపాన్ని చూసి వస్తువులను కొనుగోలు చేయకుండా, వాటి నాణ్యతకు సంబంధించిన వివరాలను కూడా నిర్ధారించుకోవాలని తెలిపారు.

ప్రమాణాలు అనేవి ఉత్పత్తుల నాణ్యతను నిర్ధారించడమే కాకుండా ప్రజల ఆరోగ్యం, భద్రతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని వెంకటాచలం వివరించారు. ప్రమాణాలకు అనుగుణంగా తయారైన వస్తువుల వినియోగం ద్వారా నాణ్యతలేని ఉత్పత్తుల వల్ల కలిగే నష్టాలను తగ్గించవచ్చని, వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కూడా దోహదపడుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత వస్తువుల నాణ్యతను గుర్తించే విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

ప్రతి సంవత్సరం అక్టోబరు 14న ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహించడం వెనుక ప్రధాన ఉద్దేశం ప్రమాణాల ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేయడమేనని తెలియజేశారు. నాణ్యత, భద్రతకు సంబంధించిన ప్రమాణాలపై అవగాహన పెరిగినప్పుడే వినియోగదారులు సరైన నిర్ణయాలు తీసుకోగలరని తెలిపారు.

విద్యార్థులు తమ ఇళ్లలోనే కాకుండా పరిసర ప్రాంతాల్లోనూ ప్రమాణాల గుర్తులపై అవగాహన కల్పించాలని, నాణ్యమైన వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని వెంకటాచలం పిలుపునిచ్చారు. భారత ప్రమాణాల సంస్థకు చెందిన బీఐఎస్ కేర్ యాప్ ద్వారా సంబంధిత ఉత్పత్తుల ప్రమాణాలు, ధ్రువీకరణ వివరాలను పరిశీలించి వినియోగదారులు తమకు అవసరమైన సమాచారాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు.

వినియోగదారులు నాణ్యత, భద్రత ప్రమాణాలపై అవగాహన పెంపొందించుకుని బాధ్యతాయుతంగా కొనుగోళ్లు చేసినప్పుడే మోసాలకు గురయ్యే అవకాశాలు తగ్గుతాయని, సురక్షితమైన వినియోగ సంస్కృతి బలపడుతుందని ఎల్. వెంకటాచలం తెలిపారు.

## మందస ఎంపీపీ, జడ్పీటీసీలను ఎస్టీలకు కేటాయించాలి

### - వైఎస్సార్ సీపీ పలాస ఎస్టీ సెల్ అధ్యక్షుడు సవర నందు



**మందస, అక్టోబరు 14(వార్త):** అత్యధిక గిరిజన జనాభా గల మందస మండల ఎంపీపీ స్థానాన్ని గిరిజనులకు కేటాయించాలని వైఎస్సార్ సీపీ పలాస నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షుడు సవర నందు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం మందస మండలంలో సుమారు 129001 గిరిజనులు రెండవ అత్యధిక జనాభా గల ఓటర్లు నమోదై ఉన్నారన్నారు. ఇప్పటి నోటిఫికేషన్లు మందస మండల ఎంపీపీ, జడ్పీటీసీ పదవుల్లో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 2009 నుండి 2019 వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి హయాంలో, కీర్తిశేషులు మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు హయాంలో మాత్రమే ఎంపీపీ గిరిజనులకు కేటాయించడం జరిగిందని, వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గత ప్రభుత్వంలో జడ్పిటిసి మహిళా స్థానాన్ని గిరిజనులకు కేటాయించి తగిన గౌరవం కల్పించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గిరిజనులకు కావాలనే వివక్ష చూపుతూ నిర్లక్ష్య వైఖరితో కేవలం ఎంపీపీ జడ్పిటిసి స్థానాలకు బిసి మహిళకి కేటాయించడం ఏమాత్రం తగదన్నారు. స్థానిక ఎన్నికల్లో గిరిజనులు ప్రస్తుత ప్రభుత్వానికి బుద్ధి చెప్పి రోజులు దగ్గరలోని ఉన్నాయని హెచ్చరించారు. అదేవిధంగా పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ పదవి ఎస్టీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. గిరిజనులు అంటే కేవలం ఓటర్లు గాని చూడకుండా ఒక ఉన్నతమైన పదవులు ఇచ్చి గౌరవించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మందస మండల మాజీ జడ్పిటిసి సవర చంద్రమ్మ, టంగరపుట్టి మాజీ సర్పంచ్ సవర నవిత, వైఎస్ఆర్సిపి నాయకులు సవర కోదండరావు, చిన్నవాసు పాల్గొన్నారు.

## ఐఈఆర్పీ భోజరాజు కుటుంబానికి రూ.లక్ష సాయం

**మందస, అక్టోబరు 14(వార్త):** సొండిపూడి గ్రామానికి చెందిన ఐఈఆర్పీ మిస్క భోజరాజు ఆకస్మికంగా మరణించారు. లావేరు మండలంలోని ఆయన పని చేస్తూ.. మృతి చెందారు. భోజరాజు పెద్దకర్మ కార్యక్రమానికి ఐఈఆర్పీలు వెళ్లి, నివాళులు అర్పించారు. అనంతరం ఐఈఆర్పీలు తరపున, మందస మండలంలోని కొంతమంది ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు, ఐఈఆర్పీ మిత్రులు తరపున కలిసి, ఆయన కుటుంబానికి రూ. 1,00,000 ఆర్థిక సహాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో మందస మండల విద్యాశాఖాధికారి ఎం.లక్ష్మణరావు, ఐఈఆర్పీల తరపున పూజారి శ్రీదర్, హనుమంతు భానుమూర్తి, కిల్లి ప్రసాద్, బమ్మిడి రమేష్, శ్రీనివాసరావు, సూర్యం, మందస ఎంఆర్సీ సిబ్బంది రత్నాల లవకుమార్, దాసరి రాంబాబు, యానాది జయరాం, కరుణాకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికే పేరు పేరున ధన్యవాదములు తెలిపారు.

కొద్దిరోజుల క్రితం హార్ట్ ఎటాక్ తో చనిపోయిన మిస్క భోజరాజు స్వస్థలం మందస మండలంలోని సొండిపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో భాగంగా తనతో పని చేసిన ఐఈఆర్పి యూనియన్ చొరవ తీసుకొని రాష్ట్రంలో ఉన్న ఐఆర్పి మిత్ర బృందం, సర్వశిక్ష అభియాన్ సెక్టోరియల్ ఆఫీసర్స్, మందస మండలంలో ఉన్న కొంతమంది ఉపాధ్యాయులు, మందస ఎంఆర్సి స్టాఫ్ తరపున లక్ష రూపాయలను ఆర్థిక సహాయాన్ని భోజనాలు కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో మందస మండల విద్యాశాఖ అధికారి ఎం. లక్ష్మణరావు, ఎం.భాస్కరరావు, ఐఆర్పి యూనియన్ తరపున పూజారి శ్రీధర్, కిల్లి ప్రసాదరావు, హనుమంతు భానుమూర్తి, బమ్మిడి రమేష్, సవర సూర్యం, పైల శ్రీనివాసరావు, మందస ఎంఆర్సి స్టాఫ్ రత్నాల లవకుమార్, దాసరి రాంబాబు, యానాది జయరాం, ఉపాధ్యాయుడు కరుణాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఐఆర్పి శ్రీకాకుళం యూనియన్ తరపున ధన్యవాదాలు తెలిపారు.



## మునిసిపల్ ఎన్నికల బరిలోకి సుడియ హరి కుటుంబం!

### - టీడీపీ సమన్వయకర్త వెంకన్నచౌదరితో మర్యాదపూర్వక భేటీ

### - ఎన్నికల రాజకీయాలపై చర్చ

**పలాస, అక్టోబరు 14 (వార్త):** పలాస పట్టణ రాజకీయాల్లో స్థానిక ఎన్నికల సందడి మొదలవుతున్న నేపథ్యంలో సుడియ హరి కుటుంబం క్రియాశీల రాజకీయాల వైపు అడుగులు వేస్తోంది. తెలుగుదేశం పార్టీ పట్ల విధేయతను కొనసాగిస్తూ, రానున్న మునిసిపల్ ఎన్నికల్లో రాజకీయంగా కీలక పాత్ర పోషించేందుకు సన్నద్ధమవుతున్న సుడియ హరి కుటుంబ సభ్యులు బుధవారం పలాస తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త వెంకన్న చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు మద్దతుగా నిలుస్తున్న సుడియ హరి కుటుంబం, ఎన్నికల నేపథ్యంలో ప్రత్యక్ష రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలనే దిశగా ముందుకు సాగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ భేటీలో పలాస పట్టణంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రానున్న స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజలతో మరింతగా మమేకమయ్యే అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వివిధ సామాజిక వర్గాలు, రాజకీయ కుటుంబాలు తమ భవిష్యత్ కార్యాచరణకు పదును పెడుతున్నాయి. ఈ క్రమంలో సుడియ హరి కుటుంబం పార్టీ సమన్వయకర్తను కలవడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. పార్టీ నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు చేరువ కావడం, స్థానిక సమస్యల పరిష్కారంలో భాగస్వామ్యం కావడం వంటి అంశాలు రానున్న రోజుల్లో ఆ కుటుంబ రాజకీయ ప్రస్థానానికి దిశానిర్దేశం చేయనున్నాయి. స్థానిక ఎన్నికల్లో సుడియ హరి కుటుంబం తరపున ఎవరు పోటీ చేస్తారు? ఏ వార్డు నుంచి బరిలోకి దిగుతారు? పార్టీ నాయకత్వం నుంచి ఎలాంటి నిర్ణయం వెలువడుతుంది? అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ భేటీ నేపథ్యంలో పలాస పట్టణ రాజకీయాల్లో సుడియ హరి కుటుంబం తదుపరి అడుగులపై ఆసక్తి నెలకొంది.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఘనంగా 'బుజ్జమ్మ' పాట ఆడియో ఆవిష్కరణ

- ఉద్దానం కళాకారుల ప్రతిభకు వేదిక స్థానిక యువతకు ప్రోత్సాహమే లక్ష్యం
- ప్రేమ పేరుతో తల్లిదండ్రులకు దూరం కావద్దనే సందేశం



**పలాస, అక్టోబరు 14 (వార్త):** ఉద్దానం కళాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడంతోపాటు, మరుగున పడుతున్న స్థానిక కళాకారులకు తగిన గుర్తింపు కల్పించాలనే లక్ష్యంతో జి.జి. క్రియేషన్స్ ఆధ్వర్యంలో రూపొందించిన 'బుజ్జమ్మ' పాట ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం పలాసలో ఘనంగా నిర్వహించారు. ఉద్దాన ప్రాంతానికి చెందిన కళాకారుల భాగస్వామ్యంతో రూపొందించిన ఈ పాట ఆవిష్కరణకు పలువురు కళాకారులు, యువతీయువకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాటకు నృత్య దర్శకత్వం వహించిన ఇప్పిలి తారక్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రతిభ కలిగిన కళాకారులు ఎంతోమంది ఉన్నప్పటికీ, తగిన అవకాశాలు, గుర్తింపు లభించక మరుగున పడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళారంగంలో స్థానికులకు ప్రోత్సాహం అందించాలనే సంకల్పంతోనే 'బుజ్జమ్మ' పాట ఆవిష్కరణకు పలాసను వేదికగా ఎంచుకున్నట్లు తెలిపారు. తాను మందస మండలం సువర్ణపురం గ్రామానికి చెందినవాడినని, గతంలో రెండు చిత్రాలకు నృత్య దర్శకత్వం వహించానని వెల్లడించారు. ప్రేక్షకుల్లో విశేష ఆదరణ పొందిన 'సరోజినీ.. సరోజినీ' పాటకు కూడా నృత్య దర్శకత్వం అందించినట్లు తెలిపారు. కళారంగంలో ఎదగాలనే లక్ష్యంతో హైదరాబాద్, విజయవాడలోని కృష్ణానగర్‌లో అనేక అవమానాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ వెనుకడుగు వేయకుండా పట్టుదలతో స్వయంకృషితో ఈ స్థాయికి చేరుకున్నానని భావోద్వేగానికి గురయ్యారు. స్థానిక ప్రతిభకు ప్రోత్సాహమే లక్ష్యంగా ఉద్దానం ప్రాంతంలో ప్రతిభావంతులైన కళాకారులకు అవకాశాలు కల్పించి, వారి నైపుణ్యాన్ని విస్తృత ప్రేక్షకులకు పరిచయం చేయాలన్నదే ఈ పాట రూపకల్పన వెనుక ప్రధాన ఉద్దేశమని తారక్ వివరించారు. స్థానిక కళాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని కళాత్మక ప్రయత్నాలకు మార్గం సుగమం చేయవచ్చన్నారు. ఈ పాటలో భాగస్వాములైన వారంతా ఉద్దానం ప్రాంతానికి చెందిన కళాకారులేనని తెలిపారు. వినోదంతోపాటు సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని అందించాలనే ఉద్దేశంతో 'బుజ్జమ్మ' పాటను రూపొందించినట్లు తారక్ చెప్పారు. ప్రేమ పేరుతో యువత తమ తల్లిదండ్రులకు దూరం కాకూడదని, కుటుంబ బంధాల విలువను గుర్తించాలని కోరారు. యువతీయువకులు భావోద్వేగాలకు లోనుకాకుండా జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకోవాలనే సందేశం ఈ పాటలో అంతర్లీనంగా ఉందని వివరించారు. ఈ పాట రూపకల్పనకు మందస మండలం బైపల్లి గ్రామానికి చెందిన చీకటి కామరాజు, ఆయన సతీమణి వెన్నుదన్నుగా నిలిచారని తారక్ తెలిపారు. తలగాన కృష్ణారావు గీత రచన చేయగా, నగిరి చక్రపాణి సంగీతాన్ని సమకూర్చారు. చీకటి కామరాజు, వసంతన్, పవన్, మధు తదితరులు పాత్రల్లో నటించారు. బై బాల ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. ఇతర నటీనటులు, నృత్యకారులు కూడా ఈ పాట రూపకల్పనలో భాగస్వాములయ్యారు. స్థానిక కళాకారుల సమష్టి కృషితో రూపొందిన 'బుజ్జమ్మ' పాట భవిష్యత్తులో మరిన్ని కళాత్మక ప్రయత్నాలకు స్ఫూర్తినిస్తుందని కార్యక్రమానికి హాజరైన కళాకారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్దానం ప్రాంతంలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, కళాకారులకు విస్తృత అవకాశాలు కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు.

## భోజరాజు కుటుంబానికి అంబేద్కర్ యువజన అభ్యుదయ కమిటీ సాయం



**మందస, అక్టోబరు 14(వార్త):** సొండిపూడి గ్రామానికి చెందిన ఐఈఆర్పీ ఉపాధ్యాయుడు మిస్క భోజరాజు హటాత్తుగా మరణించారు. మృతుని కుటుంబానికి సొండిపూడి అంబేద్కర్ యువజన అభ్యుదయ కమిటీ సొసైటీ ప్రతినిధులు 5,000రూపాయలను అందజేశారు. మిస్క భోజరాజు మృతి పట్ల సంతాపం తెలిపారు. కార్యక్రమంలో నగిరి కరుణాకర్, యానాది వాసు, నగిరి సురేష్, రంజిత్ ఉదయపురం తదితరులు పాల్గొన్నారు.

## భక్తి, శ్రద్ధలతో కొనసాగుతున్న శ్రీదుర్గామాత మహోత్సవాలు




**మందస, అక్టోబరు 14(వార్త):** శ్రీదుర్గామాత మహోత్సవాలు భక్తి, శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మందసలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపంలో దుర్గాదేవి నవరాత్రి పూజా మహోత్సవాలు జరుగుతున్నాయి. శ్రీదుర్గాదేవి ప్రతీ రోజూ ఒక్కో అవతారంలో దర్శనమిస్తున్నారు. శ్రీదుర్గాదేవి నవరాత్రి మహోత్సవ కమిటీ ప్రతినిధులు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతీ రోజూ దంపతులు పూజలో పాల్గొంటున్నారు. యథావిధిగా జరిగిన పూజల్లో మందస పట్టణానికి చెందిన వడ్డి రామకృష్ణ, పుష్పలత దంపతులు, దేవరశెట్టి నాగేశ్వరరావు, ఇందిర దంపతులు పూజల్లో పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. శ్రీదుర్గాదేవి బుధవారం శ్రీమహాచండిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గామాతను భక్తులు దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## సొంత నిధులతో పాఠశాలకు గ్రిల్స్, గోడల నిర్మాణం

- రూ.30 వేలతో ఉపాధ్యాయురాలి సేవా కార్యక్రమం
- విద్యార్థుల భద్రత, సౌకర్యాల కోసం ప్రత్యేక చొరవ
- రెడ్డి జ్యోతిని అభినందించిన స్థానికులు



**నరసన్నపేట, త్టోబరు 14 (వార్త):** ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఓ ఉపాధ్యాయురాలు తనవంతు సహకారం అందించి ఆదర్శంగా నిలిచారు. నరసన్నపేట మండలం గొట్టిపల్లి పంచాయతీ పరిధిలోని రెడ్డికిపేట ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు స్థానిక ఉపాధ్యాయురాలు రెడ్డి జ్యోతి ముందుకు వచ్చి తన ఉదారతను చాటుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో గ్రిల్స్ లేకపోవడంతో విద్యార్థులతో పాటు పాఠశాలకు వచ్చే పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఆమె గుర్తించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూడకుండా తన సొంత నిధులతో పనులు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా సుమారు రూ.30 వేల వ్యయంతో పాఠశాల ప్రాంగణంలో గ్రిల్స్‌తో పాటు గోడల నిర్మాణం చేపట్టారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఆమె చేసిన ఈ కృషి స్థానికుల ప్రశంసలు అందుకుంది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ఉపాధ్యాయులు భాగస్వాములైతే విద్యార్థులకు మరింత మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. విద్యార్థుల సంక్షేమం కోసం వ్యక్తిగతంగా నిధులు వెచ్చించి సేవాభావాన్ని చాటుకున్న రెడ్డి జ్యోతిని స్థానికులు అభినందించారు.



## ప్రధాన రహదారి పక్కన వ్యర్థాల డంప్..

# దుర్వాసనతో ఇబ్బందులు

- జగనన్న కాలనీ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో పేరుకుపోతున్న చెత్త
- వాహనచోదకులు, స్థానికులకు దుర్వాసనతో అవస్థలు
- వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించాలని స్థానికుల విజ్ఞప్తి

**జలుమూరు, అక్టోబరు 14 (వార్త):** చల్లవానిపేట సమీపంలోని జగనన్న కాలనీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రధాన రహదారిని ఆనుకుని వ్యర్థాలు పేరుకుపోతుండటంతో స్థానికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పక్కనే చెత్తను పడేయడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వ్యాపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పరిధిలో సేకరించిన వ్యర్థాలను నిర్ణీత డంపింగ్ యార్డుకు తరలించి పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాల్సి ఉండగా, సిబ్బంది చెత్తను రహదారి పక్కనే పడేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనచోదకులతో పాటు సమీప ప్రాంతాల ప్రజలు దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రధాన రహదారిని ఆనుకుని చెత్తను వేయడం వల్ల పరిసరాల పరిశుభ్రత దెబ్బతినడంతో పాటు ప్రజలకు అసౌకర్యం కలుగుతోందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారి పక్కన పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

- మొదటి విడతలో 6,712 ఇళ్లు మంజూరు
- ఇంకా 1,544 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి
- రెండో విడతలో మిగిలిన 142 ఇళ్లపై సమీక్ష

**నరసన్నపేట, అక్టోబరు 14 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాలను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని హౌసింగ్ శాఖ డీఈ అప్పారావు సిబ్బందికి సూచించారు. బుధవారం నరసన్నపేటలోని హౌసింగ్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి, నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. మొదటి విడతలో నియోజకవర్గానికి మొత్తం 6,712 గృహాలు మంజూరయ్యాయని, వీటిలో ఇంకా 1,544 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉందని డీఈ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి, పనుల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులతో సమన్వయం చేసుకుంటూ నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. రెండో విడతకు సంబంధించి కూడా ఇంకా 142 గృహాల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఆయా ఇళ్ల నిర్మాణాల ప్రస్తుత స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పనుల పురోగతిపై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీఈ అప్పారావు స్పష్టం చేశారు. నిర్మాణాల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.



## ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలి

- గుర్తించిన పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలి
- వేతనదారులకు పనులు కల్పించేలా చర్యలు చేపట్టాలి
- ఉపాధి హామీ సిబ్బందికి ఎంపీడీవో సూర్య ప్రకాశరావు ఆదేశాలు

**పోలాకి, అక్టోబరు 14 (వార్త):** వీబీజీ రాంజీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టాల్సిన పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూర్య ప్రకాశరావు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం పోలాకి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు.

జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపాధి హామీ పనుల పురోగతిపై స్పష్టమైన ఆదేశాలు అందాయని ఎంపీడీవో తెలిపారు. ఈ నేపథ్యంలో మండలంలో చేపట్టేందుకు గుర్తించిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి అమలులో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. పనుల ప్రస్తుత పరిస్థితిని సమీక్షిస్తూ, పూర్తిచేయాల్సిన పనులకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కోరే వేతనదారులకు పనులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటికే గుర్తించిన పనులను పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పథకం లక్ష్యాలకు అనుగుణంగా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో సూర్య ప్రకాశరావు ఆదేశించారు.



## నిధుల మంజూరుపై బెల్లుపడ వాసులు హర్షం



**ఇచ్ఛాపురం, అక్టోబరు 14 (వార్త):** బెల్లుపడ మహిళలు, గ్రామస్తులు కృష్ణ సాగర్ రోడ్డు కొరకు నిధులు మంజూరైనందున శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాలం అశోక్ బాబు కి రాష్ట్ర బీసీ రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మన్ కొండ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నో ఏళ్లుగా రహదారి సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్న బెల్లుపడ ప్రజల అవస్థలను గుర్తించి, రోడ్డు మంజూరు చేయించారు. 15 వ ఆర్థిక సంఘం నిధులు 14 లక్షలు మంజూరు చేసి ఇచ్చినందుకు గ్రామానికి చెందిన మహిళలు అమితమైన హర్షం వ్యక్తం చేశారు. ఊరి మౌలిక వసతుల కల్పనకు, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి మరియు నాయకులకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లుపడ గ్రామ మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అలరించిన నాట్యాలు

**ఇచ్ఛాపురం, అక్టోబరు 14 (వార్త):** గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి మూడవ రోజు రాత్రి వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులచే శ్రీనివాస కళ్యాణం నవదుర్గ అష్టోత్తరం అన్నమయ్య సంకీర్తనలకు వీనులకు విందుగా జరిగింది.నాట్య గురువు బలివాడ శృతి పట్నాయక్ వెంకటేశ్వర స్వామి గెటప్ తో అలాగే శ్రీకృష్ణుని వేషంలో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆలయంలో భక్తులు కార్యక్రమం చూడడానికి వేల సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 20 మంది చిన్నారులు పాల్గొని చక్కటి కార్యక్రమాన్ని అందించారు. అకాడమీ అధ్యక్షులు చిన్నా గురుస్వామి జయలక్ష్మి దంపతులు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కళాకారులకు సత్కరించారు. స్వేచ్ఛ వతి అమ్మవారు మూడో రోజులు కుష్మాండ అవతారం లో భక్తులు కి దర్శనమిచ్చారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పంచాయతీ ఎన్నికలకు సిబ్బంది సిద్ధంగా ఉండాలి

**- ఓటరు జాబితాలను వార్డుల వారీగా పరిశీలించాలి**

**- నోటిఫికేషన్ రాగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలి**




**నరసన్నపేట, అక్టోబరు 14 (వార్త):** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్వరలో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు అధికారులు, సిబ్బంది ముందస్తుగా సిద్ధంగా ఉండాలని నరసన్నపేట పంచాయతీ ఈవో జగన్మోహనరావు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం నరసన్నపేట పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఈవో సూచించారు. ఇప్పటికే సిద్ధం చేసిన ఓటరు జాబితాలను వార్డుల వారీగా క్షుణ్ణంగా పరిశీలించాలని, జాబితాల్లోని వివరాలను సరిచూసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించిన విధులు, బాధ్యతలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి అధికారిక నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు అవసరమైన కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని జగన్మోహనరావు ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి వచ్చే సూచనలు, ఆదేశాలను ఎప్పటికప్పుడు అమలు చేస్తూ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఓటరు జాబితాల పరిశీలనతో పాటు ఇతర ముందస్తు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో పంచాయతీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి యోగా పోటీలోష్లు శ్రీకాంత్‌కి స్వర్ణం




**ఇచ్ఛాపురం, అక్టోబరు 14 (వార్త):** ఈ నెల 10 నుండి నెల్లూరు జిల్లా కావలి లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వాల్మీకి యోగ కేంద్రం లో 39 వ రాష్ట్ర స్థాయి యోగసన పోటీలు జరిగాయి. ఇచ్ఛాపురం కి చెందిన శ్రీకాంత్ మహంతి గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

## అనారోగ్య బాధితులకు ఆర్థిక చేయూత



**సంతబొమ్మాళి, అక్టోబరు 14 (వార్త):** నౌపడ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని టీడీపీ సీనియర్ నాయకుడు వాడరేవు కృష్ణరావు పరామర్శించారు. ఇటీవల పక్షవాతానికి గురైన రోకళ్ల మహాలక్ష్మిని కలిసి ఆమె ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఆమెకు రూ.5 వేల నగదు సాయం అందజేశారు. అదేవిధంగా గుండెపోటుకు గురై చికిత్స పొందుతున్న లక్కోజి మల్లికార్జునరావు (చిట్టి)ని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయనకు రూ.2 వేల ఆర్థిక సాయం అందించారు. ఇటీవల గిన్ని కోటేశ్వరరావు మాతృమూర్తి గిన్ని పద్మ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్రి శంకర్‌రెడ్డి, కర్రి హేమరావు, సుగ్గు నాగిరెడ్డి, సుగ్గు అప్పలరాజు, పైల శంకర్‌రెడ్డి, నాయినపాత్రుని కూర్మారావు, శ్రీను, కొంతారి తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పిలి దంపతులకు ఘన సన్మానం



**కంచిలి, అక్టోబర్ 14 (వార్త):** కంచిలి మండల మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ ఇప్పిలి లోలాక్షి కృష్ణారావు తన పదవీకాలంలో ప్రజలకు అందించిన సేవలను కొనియాడుతూ గోకర్ణపురం పంచాయతీ పరిధిలోని జే. నారాయణపురం గ్రామ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, మండల అభివృద్ధికి వారు చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ నాయకులు, పార్టీ శ్రేణులు ఆత్మీయంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రజాసేవలో వారు అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దుర్గాసి మాధవరావు, కాళ్ళ వైకుంఠరావు, మామిడి లోకనాథం, కొల్లి మాధవరావు, లోట్ల చిరంజీవులు, కాళ్ళ లక్ష్మీనారాయణ తదితర గ్రామ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

**- నౌపడ మాజీ సర్పంచ్ విష్ణుమూర్తి కుటుంబానికి పేరాడ తిలక్ పరామర్శ**

**-అనారోగ్య బాధితులకు అండగా టీడీపీ సీనియర్ నాయకుడు వాడరేవు కృష్ణరావు**

**సంతబొమ్మాళి, అక్టోబరు 14 (వార్త):** సంతబొమ్మాళి మండలంలోని వివిధ గ్రామాల్లో మృతుల కుటుంబాలకు, అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు రాజకీయ నాయకులు బుధవారం అండగా నిలిచారు. నౌపడ మాజీ సర్పంచ్ కర్రి విష్ణుమూర్తి, కోటపాడు గ్రామానికి చెందిన కొయ్యన సంజీవరావు మృతి చెందడంతో ఆయా కుటుంబాలను వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కెల్లి జగన్నాయకులు, మండల పార్టీ అధ్యక్షుడు బి. మోహన్‌రెడ్డి, నాయకులు మేరుగ అప్పారావు, సత్తారు సత్యం తదితరులు పాల్గొన్నారు.





## వంశధార కాలువలో కుళ్లిన గోవు మృతదేహం

**- నాలుగు రోజులుగా తొలగించకపోవడంతో పరిసరాల్లో దుర్వాసన**

**- ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని స్థానికుల ఆవేదన**

**- వెంటనే మృతదేహాన్ని తొలగించాలని ప్రజల విజ్ఞప్తి**

**నరసన్నపేట, అక్టోబరు 14 (వార్త):** జమ్ము జంక్షన్ వద్ద వంశధార కాలువలో గుర్రపుడెక్క మధ్య గోవు మృతదేహం కుళ్లిపోవడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు రోజుల క్రితమే ఆవు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అయినప్పటికీ మృతదేహాన్ని తొలగించకపోవడంతో దుర్వాసన రోజురోజుకూ పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో గుర్రపుడెక్క మధ్య చిక్కుకున్న గోవు మృతదేహం నుంచి వెలువడుతున్న దుర్వాసనతో అటుగా రాకపోకలు సాగించే వారితో పాటు సమీప ప్రాంతాల నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన భరించలేక గ్రామపంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేయగా, వారు వచ్చి పరిశీలించి వెళ్లినట్లు స్థానికులు పేర్కొన్నారు. అయితే మృతదేహాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన అధికారులు ఈ సమస్యపై తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. గోవు మృతదేహాన్ని వెంటనే తొలగించి, కాలువ పరిసరాలను శుభ్రం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దుర్వాసన కారణంగా ప్రజారోగ్యానికి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## సోంపేట ఎంపీపీ పీఠం బీసీ మహిళకు

**- జడ్పీటీసీ స్థానం అందరికీ!**

**సోంపేట, అక్టోబర్ 14 (వార్త):** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగిన నేపథ్యంలో సోంపేట మండలానికి సంబంధించి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సోంపేట ఎంపీపీ స్థానాన్ని బీసీ మహిళకు రిజర్వ్ చేశారు. అలాగే జడ్పిటిసి స్థానాన్ని అన్ రిజర్వ్ గా కేటాయించి అందరికీ అవకాశం కల్పించారు. దీన్నిబట్టి జెడ్పిటిసి పదవికి మహిళలు, పురుషులు అలాగే ఏ సామాజిక వర్గం నుంచైనా ఎవరైనా పోటీ చేయవచ్చు. ఎప్పుడెప్పుడా అంటూ ఎన్నికల నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న రాజకీయ నేతలకు బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడంతో ముఖ్యంగా రిజర్వేషన్లకు సంబంధించిన ఉత్కంఠకు తెరపడింది.

మండల పరిషత్ బీసీ మహిళలకు కేటాయించడంతో పదవి కోసం ఉవ్వేళ్ళురుతున్న రాజకీయ పార్టీల నాయకులు వారి సతీమణులకు రంగంలోకి దించే ప్రయత్నాలు మొదలుపెట్టారు. చాలాకాలంగా సోంపేట ఎంపీపీ స్థానం బీసీలకు మాత్రమే కేటాయిస్తూ వస్తున్నారు. ఊహించినట్లుగానే ఇప్పుడు కూడా బీసీలకు లభించినప్పటికీ పురుషనేతల ఆశలకు గండి పడింది. అయితే జడ్పిటిసి విషయంలో మాత్రం ఈసారి భిన్నంగా అన్ రిజర్వ్ కేటగిరీలో పెట్టడంతో అన్ని వర్గాలకు అవకాశం లభించే పరిస్థితి ఏర్పడింది. మరి కొద్ది రోజుల్లో ఈ పదవులకు ఏ పార్టీ నుంచి ఎవరా అన్నది స్పష్టం కానుంది.

### పటిష్ట భద్రత నడుమ

## స్థానిక సంస్థల ఎన్నికలు

*** జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి**

*** ఎన్నికల పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన**

**శ్రీకాకుళం, అక్టోబర్ 14 (వార్త):** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి బుధవారం ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని గర్ల్స్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌తో పాటు బాయ్స్ పాఠశాల, ఏపీ మోడల్ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఇచ్ఛాపురం రూరల్ మండలంలోని ఈదుపురం గ్రామంతో పాటు కవిటి మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అదేవిధంగా పలాస – కాశీబుగ్గ పరిధిలో ఎన్నికల స్ట్రాంగ్ రూములను, హైపర్ సెన్సిటివ్ గ్రామమైన చిన్న బాడంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ, ఎన్నికల సామగ్రి భద్రత, స్ట్రాంగ్ రూమ్‌ల నిర్వహణ, కౌంటింగ్ రోజు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు, భౌగోళిక పరిస్థితులు, రాకపోకల మార్గాలు, రూట్ మ్యాప్‌లు, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత తదితర అంశాలను జిల్లా ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూ లైన్ల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ఎన్నికలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి చట్టప్రకారం ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అవసరమైన సీసీ కెమెరాలు, ఇతర భద్రతా పర్యవేక్షణ వ్యవస్థలు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రజలందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా, ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ సమన్వయంతో ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.



## నరసన్నపేట నియోజకవర్గంలో ఎంపీపీ రిజర్వేషన్లు ఖరారు

**- నరసన్నపేట, పోలాకి, సారవకోట, జలుమూరు మండలాలకు కేటాయింపులు**

**- రిజర్వేషన్లతో ఆశావాహుల్లో పెరిగిన రాజకీయ సందడి**

**- ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో గ్రామాల్లో మొదలైన హడావుడి**




**నరసన్నపేట, అక్టోబరు 14 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల ఎంపీపీ (మండల పరిషత్ అధ్యక్ష) స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. దీంతో ఆయా మండలాల్లో రాజకీయంగా ఎన్నికల సందడి మొదలైంది. రిజర్వేషన్ల ప్రకటనతో వివిధ పార్టీలకు చెందిన ఆశావాహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ఖరారైన రిజర్వేషన్ల ప్రకారం నరసన్నపేట ఎంపీపీ స్థానం బీసీ మహిళకు, పోలాకి ఎంపీపీ స్థానం బీసీ జనరల్‌కు కేటాయించారు. సారవకోట, జలుమూరు మండలాల ఎంపీపీ స్థానాలను జనరల్ మహిళలకు కేటాయించారు. ఈ కేటాయింపులతో ఆయా మండలాల్లో పోటీకి సిద్ధమవుతున్న ఆశావాహులు తమ రాజకీయ సమీకరణాలపై దృష్టి సారిస్తున్నారు. రిజర్వేషన్ల ఖరారుతో ప్రధాన పార్టీల నాయకులు అభ్యర్థుల ఎంపికపై సమాలోచనలు ప్రారంభించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. తమకు అనుకూలమైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు ఆశావాహులు పార్టీ నాయకులతో సంప్రదింపులు జరుపుతూ, స్థానికంగా తమ మద్దతును కూడగట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో గ్రామాల్లోనూ రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపిక, పార్టీల వ్యూహాలు, స్థానిక నాయకుల సమీకరణాలపై ఆసక్తి నెలకొంది. రానున్న రోజుల్లో ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగేకొద్దీ మండలాల్లో రాజకీయ సందడి మరింత పెరిగే అవకాశం ఉంది.

## కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ సీఐగా అప్పారావు బాధ్యతల స్వీకరణ

**- శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం**

**- స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు**

**- జా సమస్యల పరిష్కారం, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి**



**పలాస, అక్టోబరు 14 (వార్త):** కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ నూతన సిఐ గా ఏం. అప్పారావు బాధ్యతలు బుధవారం రాత్రి స్వీకరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన తెలిపారు. ప్రజల సమస్యలపై సత్వరమే స్పందిస్తూ, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ఠమైన చర్యలు చేపడతామని అప్పారావు స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు పోలీసు సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తామని వెల్లడించారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెంపొందించేలా విధులు నిర్వహిస్తామని, అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించబోమని ఆయన తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారం, చట్టవ్యతిరేక కార్యకలాపాలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిణామాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతో నేరాలను అరికట్టడంతోపాటు, పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను సమర్థంగా నిర్వ హించేందుకు కృషి చేస్తానని నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏం. అప్పారావు తెలిపారు.

### ప్రశాంతంగా కొత్తమ్మతల్లి శోభాయాత్ర

కోటబొమ్మాళిలో నిర్వహించిన కొత్తమ్మతల్లి అమ్మవారి శోభాయాత్ర పటిష్ట పోలీసు భద్రత నడుమ ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి తెలిపారు. ఉత్సవాల సందర్భంగా సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పరిస్థితులను పర్యవేక్షించారు. ప్రత్యేక పోలీసు బృందాల మోహరింపు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల మళ్లింపు, ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.జిల్లా పోలీసుల సమన్వయం, ప్రజల సహకారంతో వ్యవసాయ యార్డు నుంచి కొత్తపేట జంక్షన్ మీదుగా అమ్మవారి ఆలయం వరకు శోభాయాత్ర ఎటువంటి ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా ప్రశాంతంగా సాగిందని ఎస్పీ తెలిపారు. ఉత్సవాల సమయంలో అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546